# అట్టహాసం

పులికంటి కృష్ణారెడ్డి



ఒకప్పుడు రాజులకు రాజ్యాలుండేవి!

ఆ రాజ్యాల్ని రాజులు పాలించేవాళ్ళు. రాజ్యాల్ని పాలించిన రాజుల్ని అట్టహాసాలు పరిపాలించేవి!

అట్టహాసంగా రాజ్యాలేలిన రాజన్యుల అధికారముద్రలు పాపం! ఉన్నట్లుండి అంతరించినాయి. అయితే కంటికి రెప్పలా, కట్టుకొన్న పెళ్ళాల్లా వాళ్ళ బతుకుల్తో కలగలిసిపోయిన అట్టహాసాలు మాత్రం వాళ్ళను వదల్లేక, వదిల్తే తలదాచుకోవడానికి తావు దొరక్క వాళ్ళతోనే రాణివాసం చేస్తున్నాయి- నేటి గాంధేయుల్ని వదల్లేని నాటి గాంధిటోపీల్లాగా!

గాంధీ- మహాత్ముడు. మహాత్ముడు కనిపెట్టిన టోపీ కాబట్టి దానికి మహత్యముంది. మహత్యముంది కాబట్టే నేటికీ కొందరు రాజకీయ నాయకులు దాన్ని వదల్లేకున్నారు. ఆ టోపీ కూడా నమ్ముకున్న వాళ్ళకు 'టోపీ' వెయ్యడం లేదు.

అట్టహాసమూ అంతే!

కనుసన్నల్లో అట్టహాసం. కాలు తీస కాలు పెడ్తే అట్టహాసం. చిటికెవేస్తే అట్టహాసం. చేయి చాపితే అట్టహాసం. తలపంకిస్తే అట్టహాసం. పరికిస్తే అట్టహాసం. దానం చేయడంలో అట్టహాసం దండించడంలో అట్టహాసం. మాటలో అట్టహాసం. మమతలో అట్టహాసం. వెరశి ఒక నాటి రాజుల బతుకే ఒక అట్టహాసం!

ఈ అట్టహాసాన్ని ఆశ్రయించిన రాజులకు కొందరికి ఈ నాడు కూడా బతుకు ఏదో ఒక విధంగా అట్టహాసం గానే జరిగి పోతూ ఉంది.

మా 'రాజా' దీనికి ప్రబల తార్కాణం!

అట్టహాసాన్ని ఆవిష్కరించడానికి అవస్థ పడదకంటే 'రాజా'ను ఆవిష్కరిస్తే అట్టహాసమంటే సుళువుగా అర్ధమవుతుంది.

"రాజా! అంటూ గొప్పలు చెప్పుకొంటున్నారే? ఈ రాజాగారికి తలదాచుకోవడానికి 'గాంధి టోపి' అడ్డముంది కానీ జానెడు కొంపలేదే?' అని ఎవడైనా నోరు జారినాడంటే దారిన పొయ్యే దానయ్యే దవడపళ్ళు రాలతంతాడు. ఎందుకంటే?- ఆ ఉళ్ళో ఉన్న అయిదారు అధునాతన మైన హోటళ్ళల్లో ఒక్కొక్క హోటల్లో ఒక్కొక్క గది 'రాజా' అధీనంలో ఉంటుంది. చేయి చాపనవసరం లేదు. చూపు చూస్తే చాలు. తాళాలు ఎగిరి చేతిలో పడ్తాయి!

"హోటళ్ళల్లో గదులేముంది? ఎవడికైనా ఉంటాయి దబ్బు లిస్తే కొంగేసే వారకాంతల్లాగా. మరి కారో?" – అని అంటే- రాజా కాలు కింద పెట్టడు. కాలు కింద పెట్టడంటే రాజాగారికి కాళ్ళులేవా? – అని అడిగేవాళ్ళకు కళ్ళులేవు. ఎందుకంటే రాజాగారు ఎప్పుడూ మారుతీ కార్లో కనిపిస్తాడు. అప్పుడప్పుడు దర్జాగా మారుతి డిలక్స్‌లో తిరుగుతుంటాడు. అంబాసిడర్‌లో ఒకసారి దర్శన మిస్తే యింకొక్కసారి ఖంటెస్సాలో కాలు మీద కాలేసుకొని కూర్చొని ఉంటాడు.

"సొమ్మొకడిది. సోకొకడిది! అన్నట్లు



ఎవడిదో కారు. రాజాగారిదిజోరు. పమవ్వూ సాయూ లేని బతుకులిట్లా ఎంతకాలం కొనసాగతాయ్?" అని అడిగితే – చదువెందుకూ? మూకుడు చెత పట్టుకొంటే మూర్ఖుడికైనా అంతముష్ట దొరుకుతూ ఉంది. సర్టిఫికెట్లు పట్టుకొంటే ఏమౌతుంది? చెప్పులరిగి పోతాయ్. అయినా రాజా గారికేం?- అంగ్లం అద్భుతంగా మాట్లాడ్తాడు. హిందీని అందంగా హుందాగా పలుకుతాడు. ఇక దక్షిణాది భాషలైతే దంచేస్తాడు!

రాజా అర్థమైనట్లే ఉంటాడు. కాని అర్థం కాడు. చాలా అందుబాటులో ఉన్నట్లే కనిపిస్తాడు. కాని అందడు. ఎక్కడ చూసినా ఉన్నట్లే ఉంటాడు. అయితే ఎక్కడా దొరకడు.

నవ్వు నాలుగు విధాలా చేటంటారు. కాని రాజాకు మాత్రం నవ్వు నాలుగు నాలుగులు పదహారు విధాలా కల్సి వచ్చింది. మాటకు ముందు నవ్వుతాడు నవ్వుతూ మాట్లాడుతాడు

మాట్లాడ్తా ఉంటే అట్టహాసం!

నవ్వుతూ ఉంటే మరి అట్టహాసం!!

రాజా ఎప్పుడూ పదిమంది మధ్యలో ఉంటాడు. ఆ పది మంది పదిరాళ్ళు. రాజగారు మాత్రం రత్నం. పది రాళ్ళల్లో ఒకరత్నం చూడముచ్చటగా కాదు– అట్టహాసంగా ఉంటుంది.

రాజా ఖద్దరు పంచె కట్టాడు. ఖద్దరు లాల్చీ తొడుక్కుంటాడు. రెండూ సిల్కువే!–

మోకాళ్ళకిందకి లాల్చి. చేతుల్ని మింగేస్తూ లాల్చీ చేతులు. పాదాల కిందికి జారి అపాదాల పై పారాడుతున్న సరిగంచులు. రాజా నడుస్తుంటే సరిగంచులు విధుల్ని ఊడుస్తుంటాయి అట్టహాసంగా! – గాంధి యిప్పుడుండి ఆ దృశ్యాన్ని చూసి ఉంటే ఖద్దరుకు పట్టిన గతికి కళ్ళ నీళ్ళు పెట్టుకొనే వాడేమో?– కానీ "ఇద్దరు వల్ల ఏదో ఒక సామాజిక ప్రయోజనం జరుగుతున్నది' అని నేటి గాంధేయ వాదులు సరిపెట్టుకొంటున్నారు.

రాజా ఉంగరాలు పెట్టుకొంటారు.

"రాజాయేనా ఉంగరాలు పెట్టుకొనేది. అందరూ పెట్టుకొంటారు." అని ఎవరైనా ఎదురు ప్రశ్న వేస్తే వాళ్ళకు అట్టహాసానికి బొత్తిగా అర్థం తెలియదన్న మాట. ఉంగరాలు అందరు పెట్టుకొంటారు. రెండు చేతుల్లోని ఒక్క వేలికి పెట్టుకొంటారు. లేదా రెండు వేళ్ళకు పెట్టుకొంటారు. కాని రాజా అట్లా కాదే? ఎనిమిది వేళ్ళకు పదహారు ఉంగరాలైనా పెట్టుకొనే వాడే కాని అట్టహాసంగా ఉండదని ఎనిమిది వేళ్ళకు పది ఉంగరాలు మాత్రమే పెట్టుకొంటాడు. రోల్డ్ గోల్డ్ చేతిగడియారానికి గోల్డ్ చైన్ వేసి వదులొదులుగా కుడి చేతికి పెట్టుకొంటాడు.

పాపం! లాల్చి పొడు గాటి చేతుల్లో యివన్ని బురఖాల చాటుల్లో అందమైన మొగాల్లా అజ్ఞాత

వాసం చేస్తుంటాయి.

అందుకే రాజాగారు కూర్చున్నా, నడుస్తున్నా, కారులో పయనిస్తున్నా, నిలబడి. పది మందిని పలకరిస్తున్నా నాట్యం చేస్తున్నట్లుగా చేతుల్ని మార్చి మార్చి పైకెత్తి దించుతుంటాడు. అందులో కూడా ఒక అట్టహాసాన్ని గమనించండి.

రాజా ఎడమ చేతిని పైకెత్తుతాడు. పైకెత్తిన చేతిని అలవోకగా కదిలిస్తాడు. లాల్చీ చేయి కిందికి జారుతుంది– పదహారేండ్ల అమ్మాయి పైట జారినంత పని! నాలుగు వేళ్ళకున్న అయిదు ఉంగరాలు అట్టహాసాలు పోతాయి. చూడనట్లే రాజాగారు వాటివైపు ఒక్కచూపు విసరుతారు. పెదవులపై మందహాసం. అదొక అట్టహాసం!

ఆ చేతిని కిందికి దించుతాడు. నాట్యం చేసి అలిసిపోయిన అందమైన అమ్మాయిలు గ్రీన్ రూమ్‌లోకి పరుగెత్తినట్లు అయిదు ఉంగరాలు అజ్ఞాత వాసానికి వెళ్ళి పోతాయి. అప్పుడు రాజాగారు కుడి చేతిని పైకెత్తుతారు. కిందికి జారాల్నా ? వద్దా? అన్న సంశయంలో పడిన లాల్చీ చేయి , రాజాగారి చేయి అట్టహాసంగా కదిలేసరికి అమాంతంగా కిందికి జారుతుంది. అయిదు ఉంగరాలతో కలిసి 'రోల్డ్ గోల్డ్ వాచ్' అట్టహాసంగా దర్శన మిస్తుంది. అప్పుడు రాజా వాటి వైపు చూడరు. వాటిని చూస్తున్న వాళ్ళ చూపుల్లోకి చూస్తారు.

ఆ చూపుల్లో అట్టహాసం!

రాజా తిరుపతిలో అట్టహాసాలు పోతుంటాడు 'రాజాలా!

"నీ మతి మండినట్లే ఉంది. తిరుపతిలోనే ఉంటాడా? మదరాసులో ఉండడా? హైదరాబాద్‌లో ఉండడా? ఆ మాటకొస్తే ఢిల్లీలో ఉండడా? అమెరికాలో ఉండడా?" అని అంటే– అన్ని చోట్లా ఉంటాడు. తిరుపతిని కేంద్ర బిందువుగా ఉంచుకొని తరచు తన అట్టహాసాన్ని వికేంద్రీకరిస్తూ ఉంటాడు.

తిరుపతిలో ఉండడం అందరికీ కాకపోయినా కొందరికి బ్రహ్మాండమైన వరం! అందులో రాజాగారికైతే మరిన్ని!–

వస్తూ పోతూ ఉన్న చుట్టాల తాకిడికి తట్టుకోలేక తిరుపతిలో కొందరు తికమక పడిపోతున్నారు. పెద్ద పెద్ద వాళ్ళకు దర్శనాలు చేయించి కొందరు మరి పెద్దవాళ్ళయి పోయేవారు. నిజమా అంటే? ఒకటి రెండు ఉదాహరణలు చెప్పక తప్పదు.

పట్టుమని పాతికేండ్లు కాలేదు. అప్పుడు పాతిక మైళ్ళు . ఇప్పుడైతే దాదాపు నలభై కిలోమీటర్లు. అప్పుడు ముప్పావలా! ఇప్పుడు మూడు రూపాయలు చార్జి. దూరం మారలేదు. చార్జి భారం మాత్రం పెరిగింది. ఈ డబ్బు పెట్టి టిక్కెట్టు కొనడానికి యిక్కట్లు పడిన ఒక మహాశయుడు టిటి ఈలకు సలాం కొట్టేవాడు. స్పెషల్ స్క్వాడ్ వస్తే కండ్లల్లో దుమ్ము కొట్టేవాడు. శ్రీవారిసేవలో చేరినాడు. చిన్న ఉద్యోగిగా చేరినాడు. అందరు చూస్తూనే ఉన్నారు. ఏడుకొండల వాడు కూడా చూస్తూనే ఉన్నాడు. చూస్తూ చూస్తూ ఉండగానే వటుడింతై అంతై అన్నట్లుగా అతడు కోటికి పడగెత్తినాడు. చూస్తున్న వాళ్ళు చూచి నట్లే ఉన్నారు.– వేసిన గొంగళి వేసిన చోట అన్నట్లుగా! అతడు మాత్రం చేరవలసిన ఎత్తుకు చేరుకున్నాడు, అంతా ఆయన లీల!

'తెలుగు దేశంలో తిరగని చోటు లేదు. చేయని ఉద్యోగం లేదు. చలాయించని అధికారం లేదు!' అటువంటి ఒకానొక మహానుభావుడు శ్రీవారి సేవలోనే జన్మతరించాలను కొన్నాడు. ఎవరిచేతులు కాదని కాళ్ళు పట్టుకొన్నారో? ఆయన తిరుమల కొండెక్కినాడు. కొండెక్కి కూర్చున్నాడు. ఆయన సతీమణి కలర్ టీవీ ముందు కూర్చుని కిలకిలా నవ్వుతూ ఉంది– అన్నట్లుండి పట్టిన అదృష్టానికి ఉప్పొంగి పోతూ.

ఇట్లా చిన్న చిన్న గుంటల్లో చేపల పట్టడమంటే రాజాగారికి చిరాకు. చిన్నతనం కూడా. మరపడవెక్కి మహాసముద్రంలోనే వల విసరాలంటాడు. అట్లానే విసురుతున్నాడు.

చాలా చాలామంది పెద్ద పెద్ద వాళ్ళు మరి మరి పెద్ద కార్లల్లో ఏడు కొండల వాడి దర్శనార్థం తిరుపతికి వస్తుంటారు. ఆ పెద్ద పెద్ద వాళ్ళందరూ దైవదర్శనానికి ముందు రాజా దర్శనం జేసుకొంటుంటారు.

ఈ పెద్ద పెద్ద మనుష్యులు పెద్ద పెద్ద కార్లలో ఏరోజు తన కొసరం వచ్చేది రాజాకు ముందుగానే తెలుస్తూ ఉంటుంది. ఏవేళకు వచ్చేది తెలుస్తూ ఉంటుంది. అయినా రాజాగారు మాత్రం సరిగ్గా వాళ్ళు వచ్చే వేళకు అర్ధగంటకు మునుపే అయిపు లేకుండా పోతాడు!

పెద్ద పెద్ద వాళ్ళు వస్తారు. పెద్ద పెద్ద హొటళ్ళ చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఇక్కడకాదు– అక్కడంటే అక్కడికి వెళ్ళుతారు. అక్కడకాదు – మరొక్క చోట అంటే అక్కడికి పోతారు. ఎక్కడా రాజా దర్శనం లభించక పోయే సరికి కార్లలో కూలబడతారు. తెగబాధపడి పోతుంటారు. అప్పుడొకవ్యక్తి ఆపద్బాంధవుడిలా అక్కడ ప్రత్యక్షమవుతాడు.

"ఏవండి? రాజాగారి కొసమేనా మీరెదురు చూసేది?"

అని అడగతాడు.

అన్ని గొంతులు కలగలిసి 'ఔనండి!! అంటాయి ఒక్కసారిగా.

"రాజాగారిప్పుడొక సాంఘిక సేవా సంస్థను స్థాపించినారు. పేరు గుర్తులేదు కానీ , పెద్ద బజార్లో ఏ చిన్న పిల్లవాణ్ణి అడిగినా చెప్తాడు. అక్కడికవెళ్ళి చూడండి!" అంటాడు.

"పెద్ద బజారా?.... ఈ ఊళ్ళో మాకంటికి అన్నీ చిన్న చిన్న బజార్లు గానే కన్పిస్తున్నాయే?.... మరైతే ఆ పెద్ద బజారు ఎంత దూరముంటుంది? ఎటు వెళ్ళాలి?" అన్న సవా లక్ష ప్రశ్నల్ని చూపుల్తో మిళితం చేసి మిడిగుడ్లు పెట్తారు పెద్ద పెద్ద మనుష్యులు.

"అయ్యో పాపం! అంతగా యిబ్బంది పడిపోతున్నారే?" అని చూపుల్తోనే నొచ్చుకొని మాధవ సేవ కొసం వచ్చిన ఆ పెద్దమనుష్యులకు మానవ సేవకు అర్థం చెప్ప దలచు కొన్నట్లుగా అతడు తన కులానే తలుపు తీసి అట్టహాసంగా కార్లో కూర్చుంటాడు. 'పోనీయండి!' అంటాడు దర్జాగా. అతడు చెప్పినట్లు డ్రైవరు వింటాడు. డ్రైవరు చెప్పినట్లు కారు వింటుంది. పెద్ద పెద్ద మనుష్యులకు పెద్ద శ్రమ లేకుండానే ఆ సాంఘిక సేవా సంస్థముందు కార్లు ఆగుతాయి.

అందరికంటే ముందు సాంఘిక సేవకుడు కారు దిగుతాడు. పెద్ద పెద్ద మనుష్యులు ఒకరి తర్వాత ఒకరుగా దిగుతూంటే! అదో ! అదే ఆఫీసు!'అని ఎడమచేతి చూపూడు వ్రేలితో పెద్ద బజారనబడే ఆ చిన్న సందులో కుడివైపు మేడ రెండో అంతస్థుకు వ్రేలాడ దీసిన 'నేమ్ బోర్డ్ ' చూపిస్తాడు. వాళ్ళందరు ఆతురతగా ఆ బోర్డు వైపు చూస్తుంటే అతడు తన దారి తాను చూసుకొంటాడు.

ఆఫీసు కంట పడే సరికి ఆఫీసును చూపించిన వ్యక్తి గుర్తు కొస్తాడు. సాక్షాత్ ఏడు కొండల వాడే ఎదురొచ్చి తమను ఆదుకొన్నాడన్నంత సంతోషంతో ఆ పెద్ద పెద్ద మనుష్యులు తమ పెద్ద పెద్ద శరీరాల్ని యిటు మళ్ళిస్తారు. 'థ్యాంక్స్' చెప్పడానికి. అంత ఖరీదైన 'థ్యాంక్స్' అందుకొనడానికి అనర్హుడి నన్నట్లుగా అతడక్కడ కనబడడు. వాళ్ళ మొగాలు ఒక్క క్షణం రంగుమారాయి. అతడి మంచి తనాన్ని తెగమెచ్చుకుంటూ వాళ్ళందరూ అతడు వెళ్ళిపోయిన దిక్కువైపు తిరిగి వంగి వంగి నమస్కరిస్తారు!– రాజాగారి అట్టహాసంలో యిది ఒక భాగమే అని తెలియనిఅమాయకులు పాపం!

వంగి వంగి నమస్కారాలు చేయడంతో తమ బాధ్యత తీరిపోతుంది. పెద్ద పెద్ద వాళ్ళ లక్షణమే అది. అందుకని ఆ వెళ్ళిపోయిన ఏబ్రేసి మొకంగాణ్ణి పెద్దగా పట్టించుకోకుండా రాజాగార్ని కలవడానికి సైనికుల్లా బయల్దేరుతారు అయితే ఆ మేడ ముందు ఒకరి మొగం ఒకరు చూస్తూ నిలబడిపోతారు.

ఆ సాంఘిక సేవా సమితికి దేశంలో చాల పెద్ద పేరుంది. పెద్ద పెద్ద వాళ్ళ సుహృద్భావమే పెట్టుబడిగా చాలా ఆదర్శవంతంగా నెలకొల్పబడింది. చేస్తున్న సాంఘిక సేవ కేమిటో కానీ దాని తాలూకు ప్రకటనలు మాత్రం పెద్ద పెద్ద పత్రికల్లో తరచు కనిపిస్తుంటాయి. తాడిత పీడిత జనోద్ధరణ ఆ సంస్థ ధ్యేయం. అయితే ఆ సంస్థలో ప్రవేసించడం అంత సుళువుగాదని ముందు హెచ్చరిక చేస్తున్నట్లుగా ఉంటాయి మిద్దెకు యిరుకు మెట్లు!

ఆ యిరుకు మెట్లను చూసే పెద్ద పెద్ద మనుష్యులు యిరకాటంలో పడి ఒకరి మొగం ఒకరు

చూసుకుంటూ నిలబడింది. చూస్తూ నిలబడ్తే ఏమవుతుంది? ధ్యేయం రెండో అంతస్థులో ఉంది. వాళ్ళు కింద ఉన్నారు. ధ్యేయాన్ని సాధించాలంటే పైకెక్కాల్సిందే? – అందుకే. యిక తప్పదన్నట్టుగా ఒకరి వెనుక ఒకరుగా 'క్యూ' కట్టారు. ఒకరి తర్వాత ఒకరుగా ఆ యిరుకు మెట్ల మీద బెరుకు బెరుగ్గానే పైకెక్కుతారు. 'బ్రతుకు జీవుడా!' అని ఆఫీసులో అడుగు పెట్టారు.

ఆ సేవాసంస్థలో రాజాగారికి సంబంధముందో? లేదో? ఉంటే ఆ సంబంధం ఎటువంటిదో? లేకుంటే ఆ ఆఫీసులో రాజా ఎట్లా అధికారం చెలాయించ గలుగుతున్నాడో? – ఆ ఏడు కొండల వాడికే ఎరుక!

ఆ ఆఫీసులో ఏ కార్య కలాపాలు జరిగినా జరక్కున్నా ఆఫీసుమాత్రం అందంగా ఉంటుంది. పది మంది ఒక్కసారి దాడి చేసినా నిలబడవలసిన అవసరం లేకుండా కూర్చోవడానికి కుర్చీలున్నాయి. పిలవకనే పలికే ఒక నౌకరు ఆ ఆఫీసును కంటికి రెప్పలా కాపాడుతూ ఉంటాడు. వచ్చిన పెద్ద మనుష్యుల్ని అతి మర్యాదగా ఆహ్వానిస్తాడు. తలకొక్క కుర్చీ వేస్తాడు. వాళ్ళు కాలితో చెప్పిన పని చేతులతో చేస్తాడు. మళ్ళీ ఆ చేతుల్తోనే మంచి నీళ్ళు కూడా యిస్తాడు. నౌకరు చేస్తున్న సేవలకు మురిసి ఆ సంస్థ ఏ సేవ చేస్తున్నది? లేదన్న సంగతిని మరిచి పోతారు. ఆ సేవా సంస్థను దర్శించిన పెద్ద మనుష్యులు!

ఆఫీసులో అడుగు పెట్టిన పెద్ద పెద్ద మనుష్యులకు ఈ సత్కారం అట్టహాసంగా జరిగేసరికి, ఈ సత్కారానికి, రాజా సంస్కారానికి ముడి పెట్టి ఆలోచిస్తూ ఆనంద లహరిలో తేలిపోతుంటారు.

అప్పుడు మేడముందు కారుదిగుతాడు రాజా అట్టహాసంగా!

"రాజాగారు వస్తున్నారయ్యా!" అంటాడు నౌకరు వినయంగా.

అందరు ఒక్కసారిగా పైకి లేస్తారు. ఏడు కొండల వాడి ముందు వంగినంత వినయంగా వంగి నమస్కరిస్తారు.

రాజా వస్తూ మందహాసం చేస్తాడు అట్టహాసంగా!

"అరెరె! చాలాసేపయినట్టుందే వచ్చి! అబ్బబ్బ! ఏం చేయాల్నో తోచక చచ్చి పోతున్నానండి! ఈ ఊళ్ళో బతకడం కంటే ఏ అడవిలోనో తలదాచుకోవడం నయం. ఒకడొస్తాడు. మండలం ఆఫీసులో నా బతుకు ముండమోసి పోతున్నదండి!' అని ఏడుస్తాడు. ఇంకొకడొస్తాడు. 'బ్యాంకు చుట్టూ తిరిగి తిరిగి కాళ్ళరిగి పోతున్నాయ్!' అని అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకొంటాడు. మరొకడు ఎం. ఎ. ఫస్ట్ క్లాసులో పాసై సర్టిఫికేట్లు పట్టుకొని పట్టిన చేతులు వదల నంటాడు. ఏం చేయాల్నో అర్థం కాదు. ఎవర్ని కాదనాలి? ఎవరిని ఔననాలి??... ఛఛఛ! దినగండం నూరేండ్లాయుస్సుగా ఉంది బతుకు!"

ఒక చిన్న ఏక పాత్రాభినయం చేస్తూ రాజు గారు కుర్చీలో కూర్చుంటాడు అట్టహాసంగా!

"ఇవన్నీ చాలని కొదవకు ఈ వేళ మాతో గొడవ!" అని వచ్చిన వాళ్ళల్లో ఒక్కడు నొచ్చుకొన్నట్లే మెచ్చుకొంటాడు.

"అరెరె! మీదేం వుందండీ? పైకెక్కి పోవడం ఒక్కగంట. దిగిరావడం ముప్పావు గంట. అక్కడ మహా ఉంటే ఒక్క అర్ధగంట. మీతో కలిసి నాకూ దైవదర్శనం. పుణ్యం పురుషార్థం కూడా!" అంటూనే రాజుగారు పైకి లేస్తారు అట్టహాసంగా. వాళ్ళందరు వెంట నడుస్తుంటే కారు దగ్గరికి నడుస్తాడు మరి అట్టహాసంగా!

"రెండు కార్లెందు కండీ? ఒక్క కార్లో సర్దుకోవచ్చుగా?" అని అతి వినయంగా ఒకరు సలహాయిస్తుంటే –

"లేనప్పుడు సర్దుబాటు. ఉండీ అనుభవించ లేనివాడు పిసినారి. ఆ మాట పడడం నాకు చేతగాదు బాబూ!" అంటూ రాజా తన కార్లోనే కాలుమీద కాలేసి కూర్చుంటాడు అట్టహాసంగా.

కార్లు బయల్దేరతాయి!

ఊరికి ఉత్తరంగా తిరుమల కొండ. అయితే రాజాగారి కారు దక్షిణంగా పోతూ ఉంటుంది. అతిథులు ఆశ్చర్యపడతారు. రాజా పడనీ అనుకొంటాడు. అతిథులు పల్లెత్తుమాట పైకి అనలేరు. రాజా "అది వాళ్ళ ఖర్మ" అనుకొంటాడు.

అంతలోనే రాజాగారి కారు ఆగుతుంది. ఊరవతల ఒక "కాంట్రాక్టర్ యార్డ్" ముందర.

రాజా కారు దిగుతాడు. అతను దిగేసరికి అతని వెంట వచ్చిన అతిథులు దిగుతారు. రాజా ఆ "యార్డ్"లోకి అట్టహాసంగా నడుస్తాడు. వాకిట కావలి తిమ్మడు ఘూర్కా నిటారుగా నిలబడి వందన సమర్పణ చేస్తాడు. కనీసం ఘూర్కా వైపు కన్నెత్తి చూడకుండా సైనిక వందనం స్వీకరించే ప్రధానిలాగా రాజా అట్టహాసంగా లోనికి నడుస్తాడు.

అక్కడ రెండు మూడు లారీ లుంటాయి. కదిలించినా కదలని ఒక కారు ఉంటుంది. ఒక షెడ్డులో సిమెంటు బస్తా లుంటాయి. రకరకాల సైజుల్లో యినుపకమ్ములు చిందరవందరగా పడి ఉంటాయి. ఆఫీసు మాత్రం తీర్చి దిద్దినట్లు చాలా అందంగా ఉంటుంది. ఒక గోడమీద మేనేజర్ "నేమ్ బోర్డ్" యింకొక గోడకు క్యాషియర్, మరొక గోడమీద క్లార్క్ నేమ్ బోర్డ్లు మిలమిల మెరుస్తూ ఉంటాయి. ఆయా నేమ్‌బోర్డ్ కిందనే ఒక అందమైన కుర్చీ, టేబిల్ ఉంటాయి. అయితే ఆ మూడు కుర్చీలు ఎప్పుడూ ఖాళీగానే ఉంటాయి. రాజాగారు ఆఫీసులో అడుగు పెట్టేటప్పటికి ఎక్కడుంటాడో "వాచ్‌మేన్" రొప్పుతూ రోజుతూ వస్తాడు. వంగి వంగి నమస్కరిస్తూ అల్లంత దూరాన నిలబడతాడు.

రాజా అట్టహాసంగా ఆఫీసంతా కలియ చూస్తాడు. కండ్లు చికిలిస్తాడు. తల పంకిస్తాడు. ఆ తర్వాత –

"ఏరా? మేనేజ రెక్కడ?" అని గద్దిస్తాడు.

"ఇప్పుడే ఏదో పనిమీద పొయ్‌నాడయ్యా!" అంటాడు వాచ్‌మేన్ వినయంగా.

"పోనీ! క్యాషియర్ ఏమైనాడు?"


"ఇంకా రాలేదయ్యా!"

"ఛీ ఛీ! వీళ్ళు మనుష్యులా? పశువులా?.... ఏరా? నీ కెన్నిసార్లు చెప్పినాన్రా ఆఫీసులో ఎవరో ఒక రుండి తీరాలని! (అప్పటికి వాచ్‌మేన్ యజమాని అయినట్లు!) అరకాసు కోతి అర్ధణా బెల్లం తిన్నట్లుంది వ్యవహారం. రాస్కెల్స్! మీకంతా నోటి మాటలు పనికి రావురా! కాలికున్నది చేతికి తీసుకుంటే కూలు కుదరమన్నట్లు కుదురుతుంది!"

వాచ్‌మేన్ వణికి పోతుంటాడు చేతులు కట్టుకొని!

"పోనీ! క్యాష్‌చెస్ట్ తాళాలైనా యిచ్చి చచ్చినారా? - (అప్పటికి వాచ్‌మేన్ అపర హరిచ్చంద్రుడైనట్లు!) - గద్దిస్తాడు రాజా.

ఆ గద్దింపుతో అదిరిపడి వాచ్‌మేన్ నోట మాటరాక తల వంచుకొంటాడు. రాజా మరి రెచ్చిపోతాడు!



"అంతా వెధవలు. పనికిమాలిన వెధవలు!– ఇంగితజ్ఞానం లేని నీచులు– ఇప్పుడేం చెయ్యాలి నేను? ఇంతమంది మిత్రుల్ని వెంట బెట్టుకొని అడక్కతినాల్నా? ఉండీ దరిద్రు డంటారేం? నాలాంటి వాళ్ళనేరా!"

రాజా అగ్గిమీద గుగ్గిలమై చిందులు తొక్కుతుంటాడు.

"రాజుగారూ! యిప్పుడు డబ్బుతో వచ్చిన అవసర మేం(విటండీ? మేమున్నాం గదా?"– అంటూ కల్పించుకొంటారు పెద్ద పెద్ద మనుష్యులు.

"ఉంటే?"

"మీకింకా కోపం తగ్గలేదు!"

"కోపమా?.... వీళ్ళందర్నీ నరికి పోలి చల్లితే మాత్రం పాపమా? మీరందరూ నేను రమ్మంటే వస్తారా? లేదు దినమూ వస్తారా? ఎప్పుడో ఒకసారి వస్తే ఈ ఒక్కసారైనా తృప్తిగా ఖర్చు పెడదామంటే?...."

"మీరనడం మరి బాగుందండీ! యాత్రకని వచ్చిన వాళ్ళు ఒకరి ఖర్చుమీద యాత్ర చేస్తే ఆ పుణ్యఫలం దక్కదు. అది ధర్మం. మీరు మాతో రావడమే మాకు లక్షలకు లక్షలు ఖర్చు పెట్టినట్లు!.... రండి వెళ్ళుదాం!"

"ఇది యాత్రో గిత్రో నాకు తెలియదు. ధర్మమో అధర్మమో కూడా నాకు తెలియదు. మీరుండేది తిరుపతిలో. తిరుపతిలో మీ వెంట నేనుంటూ మీచేత ఖర్చుపెట్టిస్తే నా పరపతేంగాను?"

"అదా మీ సందేహం. అయితే మీరే ఖర్చు పెట్టండి!" అంటూ ఒకపెద్ద నోట్ల కట్టను రాజుగారి జేబులో కూరుతారా పెద్ద మనుష్యులు.

రాజా వద్దు వద్దంటూనే జేబును వాళ్ళకు వాటంగా తిప్పుతాడు. ఆ జేబు నిండుతుంది. అట్టహాసంగా ఏడుకొండల వాడి దర్శనం అయిన తర్వాత యింకొక జేబు నిండుతుంది!

# అట్టహాసం

రాజా అట్టహాసంగా బతుకుతున్నాడు!

అయితే తనకేమాత్రం సంబంధం లేని కాంట్రాక్టర్‌యార్డ్‌లో నానా తిట్లు తిన్న "వాచ్‌మేన్"ని, సలాంకొట్టిన ఘూర్ఖాని మరిచిపోడు. వాళ్ళను అట్టహాసంగా గమనిస్తుంటాడు.

అది రాజాగారి అట్టహాసమే!

రాజా తరచు సినిమాలకు వెళ్ళుతుంటాడు. అది కూడా మొదటిరోజు మొదటి సినిమాలే! ఒంటరిగా వెళ్ళడం రాజా అట్టహాసానికే అవమానం గనుక పది మందితో కలిసి వెళ్ళుతుంటాడు. పదిమందితో కలిసి వెళ్ళడమంటే ఎవడంటే వాడితో కాదు. ఆ ఊళ్ళో ఉన్న పెద్ద పెద్ద అధికార్లతోనే కలిసిపోతూ ఉంటాడు. అందులో కూడా ఒకసారి కనిపించిన అధికార్లతో మరొకసారి కనిపించడు. ఒకసారి పోలీస్ అధికార్లతో కలిసి అయితే యింకొకసారి ఇన్‌కంటాక్స్ మొనగాళ్ళతో! ఒకసారి కమర్షియల్ టాక్స్ వాళ్ళతో అయితే యింకొకసారి బ్యాంక్ మేనేజర్లతో!

ఆఫీసర్లని సినిమాకు ఆహ్వానించడం.... ముందుగానే సీట్లు రిజర్వ్ చేయించడం.... ఇంటింటికి స్వయాన వెళ్ళి ఆహ్వానించడం.... సినిమాలో కూర్చుంటుంటే ఎవరెవరి ప్రక్కన ఎవరు కూర్చోవాలో జాగ్రత్త పడడం.... సినిమా చూస్తూ ఉంటే మధ్య మధ్య వేడి వేడి పానీయాలు అడక్కుండానే సరఫరా చేయించడం.... సినిమా అయిన తర్వాత వాళ్ళ వాళ్ళ అభిరుచిల్నిబట్టి వాళ్ళకొక మందు పార్టీ ఏర్పాటు చేయించడం– అంతా అట్టహాసంగా జరిగిపోతుంది.

ఈ అట్టహాసాలన్నీ ఒక ఎత్తయితే సినిమా జరుగుతూంటే మధ్య మధ్య రాజాగారి కోసం పిలుపులు వస్తుంటాయి. అవి మరి అట్టహాసం!

ఆఫీసర్ల మధ్య కూర్చుని రాజా అట్టహాసంగా సినిమా చూస్తూ ఉంటాడు. అప్పుడు చేతి లైటు గుడ్డి వెలుగులో తడబడుతూ వస్తాడు గేట్‌కీపర్! వచ్చి "సార్! రాజాసార్‌కి ఫోన్‌సార్!" అంటాడు.

"అబ్బబ్బ! రామేశ్వరం వెళ్ళినా శనేశ్వరం వదలనట్లు నా పాలిటి కి యముళ్ళు ఎక్కడ దాపురించినారో? ఏమో? నేను సినిమా కొచ్చింది ఎట్లా పసికడతారో కడతారు. ఇక్కడ కూడా కాసేపు ప్రశాంతంగా ఉండనివ్వరు. ఎట్లా చావాల్నో వీళ్ళతో?" అంటూ అయిష్టంగానే పైకి లేస్తాడు. అయితే ఆదరాబాదరా వెళ్తాడు.

ఆఫీసర్లు ఆశ్చర్యంలో పడి కొట్టుమిట్టాడు తుంటారు.

"బొంబాయి నుండి ట్రంక్‌కాల్ సే ఆఫీసు నుండి యిక్కడికి డైవర్ట్ చేసినారు. గోయెంకా స్వయాన మేనమామ పినతల్లి గారి వదినె కొడుకంట. రేపు ఫ్లైట్‌లో దిగబోతున్నాడు. వెళ్ళి రిసీవ్ చేసుకోవాలి. ఈ తిరుపతిలో పుట్టడం పెద్ద నేరమై పొయ్యిందండీ!" అని తనలో తాను గొణుక్కొంటూ వస్తాడు. వచ్చి ఆపసోపాలు పడూ్త కూర్చుంటాడు.

ఆఫీసర్లు సినిమా మాట కూడా మరిచి రాజాను గురించి ఆలోచిస్తుంటారు.

అర్ధ గంట గడుస్తుంది!

అంతలోనే మళ్ళీ వస్తాడు గేట్‌కీపర్, "సార్! ఫోన్!" అంటూ.


"ఒరే! వాళ్ళను కాదురా ముందు నిన్ను తన్నాలి. ఒకవేళ ఫోన్ చేసినారే అనుకో! లేరని ఒక్క కూత కూసుంటే ఈ బాధంతా తప్పేది కదరా? మీలాంటి వెధవలకంతా తలకాయల్లో ఉండేది మట్టిరా! మట్టి!!– ఫో! లేరని చెప్పు!" అని అంటూనే, "ఏదైనా ముఖ్యమైన వార్తయితే కొంపలు మునుగుతాయ్!" అని గొణుక్కుంటూ లేచిపోతాడు.

ఆ దర్జా దర్పం తమకు లేకుండా పోయినాయే అని ఆఫీసర్లు ఆలోచిస్తుంటారు. అయితే ఆ తిట్లు తిన్నదానికి, ఆ అపద్ధపు ఫోన్‌కాల్స్ అంద చేసిన దానికి గేట్‌కీపర్‌కి అయిదు రూపాయలు అడ్వాన్సుగా ముట్టిన సంగతి వాళ్ళకేం తెలుసు?

ఈ అట్టహాసాల అంబారీల్లో ఊరేగిన ఒకానొక బ్యాంకు మేనేజర్ సంబరపడి రాజాను మరి అట్టహాసంగా చూడాలని ముచ్చటపడి పది లక్షలు అప్పు మంజూరు చేయించినాడు ఒక ప్రెస్సు పెట్టడానికని!

క్షణాలమీద లక్షలు చేతి కందినాయి. నిముషాలమీద పారిశ్రామిక వాడలో స్థలం కేటాయించ బడింది. గంటల్లో పైకి లేచినట్లుగా అందాల భవంతి నెలల్లో పైకి లేచింది. యంత్రాలు తలలో నడిచి వచ్చి అట్టహాసంగా నిలబడినాయ్!

"రాజా" ఈ అధునాతనమైన అచ్చుకూటమికి "ఇంటర్నేషనల్ పవర్ ప్రెస్" అని ఒక శుభ ముహూర్తాన నామకరణం చేసినాడు.



"ఇంటర్నేషనల్ పవర్ ప్రెస్" అనబడే ఈ చిన్నతరహా పరిశ్రమను రాజా పట్టుబట్టి భారీ పరిశ్రమల మంత్రివరేణ్యుల చేతులమీదుగానే ప్రారంభోత్సవం చేయించినాడు అట్టహాసంగా. ఆ ప్రారంభోత్సవంలో భారీ పరిశ్రమల మంత్రి అతిశ్రమతో తన భారీ కాయాన్ని కష్టపెట్టి బ్రహ్మాండంగా మాట్లాడినాడు. దేశానికి పరిశ్రమలు అందునా చిన్నతరహా పరిశ్రమలు పెద్ద వెన్నెముక లన్నాడు. వెన్నెముక లేకపోతే శరీరమే లేనట్లు పరిశ్రమలు లేకపోతే దేశమే- దేశ ప్రగతి కాదు- లేదన్నాడు. కాబట్టి ముఖ్యంగా "నేను చెప్పే దేమిటంటే? నేను చెప్పేదేమిటంటే?" అని గట్టిగా బల్ల గుద్ది, గుద్దిన చేతిని యింకొక చేత్తో తడుముకొంటూ చిన్నతరహా పరిశ్రమలకు పని కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నాడు. ఆ మాట గాలి వేగంగా పయనించి రాజధాని నగరంలో "రమ్" సేవిస్తున్న చిన్నతరహా మంత్రి చెవుల్లో పడింది. కలిసి వచ్చే కాలాన నడిచి వచ్చే కొడుకు పుట్టాడన్నట్లు వేళా విశేషం!- చిన్నతరహా పరిశ్రమల మంత్రి ఆ తెంపులోనే అప్పటికప్పుడే ఉత్తర్వులు జారీ చేసినాడు- వెంటనే ఒక పాఠ్య పుస్తకాన్ని "ఇంటర్నేషనల్ పవర్ ప్రెస్"కు ప్రింటింగు కివ్వమని!

రాజాగారే తలుచుకొంటే దెబ్బలకు కొదువ లేదన్నట్లుగా మంత్రిగారి ఉత్తర్వులు నిముషాలమీద కార్యరూపం దాల్చినాయి.

ఏడవ తరగతి సామాన్యశాస్త్రం యాభైవేల కాపీలు అచ్చువేయడానికి ప్రభుత్వం నుండి ఇంటర్నేషనల్ పవర్ ప్రెస్సుకు ఉత్తర్వు లందినాయి! ఉత్తర్వు లందిన వారం లోపుగానే లారీల్లో కాగితం దిగింది. పని అట్టహాసంగా ప్రారంభమయింది.

స్థానిక ముద్రణాలయ అధినేతలు కొందరు ముక్కుమీద వేలేసుకొన్నారు. కొందరు ముక్కు చీదుకొన్నారు. కొందరు ప్రభుత్వ పాక్షిక వైఖరిని నిరసిస్తూ కారి ఉమ్మినారు- అరచేతిని అడ్డంగా పెట్టుకొని. ఎవరేమనుకొంటే యేం? ఇంటర్నేషనల్ పవర్ ప్రెస్ అధినేత రాజా మూడు నెలలు గడువు యిస్తే రెండు నెలల్లోపుగానే ఫారాలు అచ్చు వేయించినాడు.

అచ్చయిన ఫారాల్ని మడిచి, మడిచిన ఫారాల్ని వరుసక్రమంలో పుస్తకంగా పేర్చి ఆ మీదట కుట్టాలి. కుట్టిన పుస్తకానికి అట్ట తగిలించి ఆ తర్వాత అందంగా కత్తిరించాలి.

అయితే అట్టను మాత్రం ప్రభుత్వ ముద్రణాలయమే సరఫరా చేస్తుంది. ఎందుకంటే- ఆ పనిని కూడా ప్రైవేట్ ప్రెస్సులకే అప్పచెప్పితే యాభైవేల ప్రతులంటే లక్షప్రతులు అచ్చువేసి రాష్ట్రంలో అచ్చు పుస్తకాల డిమాండ్ దృష్ట్యా వాళ్ళే ఒక దుకాణం ప్రారంభించే ప్రమాదం ఉంది కాబట్టి. యాభైవేల ప్రతులంటే యాభైవేల అట్టలే ప్రభుత్వ ముద్రణాలయం సరఫరా చేస్తుంది!

ఆ అట్టల్ని తేవడానికని రాజా అట్టహాసంగా బయల్దేరినాడు రాజధాని నగరానికి. రాజధాని నగరంలో ఒక ఫైవ్‌స్టార్ హోటల్లో దిగినాడు. డైరెక్టరుగారికి, డైరెక్టరేట్ సిబ్బందికి ఆ త్రీస్టార్ హోటల్లో "ఫైవ్‌స్టార్" గౌరవ మర్యాదల్ని జరిపించినాడు అట్టహాసంగా!

"ఆ గౌరవమర్యాదలతో ఉబ్బితబ్బిబ్బులైన డైరెక్టర్-

"రాజాగారూ! అష్టరాల్ అట్టలకోసం మీరింత దూరం పనికట్టుకొని రావాల్నా? కాకితో కబురంపినట్లు ఒక ఫోన్‌కాల్ కొట్టుంటే సరిపోయేది కదా? లారీలు ప్రెస్సు ముందు నిలబడేవి!" అని చాలా చాలా నొచ్చుకొన్నాడు.

"సార్! జరిగిందేదో జరిగి పొయ్యింది. ఇంక జరగవలసిం దాలోచించండి. అట్టలు అందినట్లు ఈ రశీదులో రాజాగారి ఒక్క సంతకం దయచెయ్యమనండి. మిగత పని నేను చూసుకొంటాను!" అని అంటూ "అట్టల గుమాస్తా" అతి వినయంగా ఫైలును రాజాగారి ముందు పెట్టాడు.

రాజా రశీదులో సంతకం పెట్టాడు అట్టహాసంగా!

ఆ తరువాత-

"అట్టల గుమాస్తా" తాను చెప్పిన పనిని తుచ తప్పకుండా నిర్వహించాడు. వారం తిరక్కముందే లారీలు అట్టల కట్టల్ని ప్రెస్సులో దించినాయి!

రాత్రింబవళ్ళు బైండింగ్ పని ఎడతెరపి లేకుండా ఏకబిగిన జరుగుతూంటే రాజా అట్టహాసంగా నవ్వుకొన్నాడు.

రెండు వారాల్లో పని పూర్తయింది. అయితే అట్టలు నలభైవేల పుస్తకాలకే సరిపడినాయి. అంటే పదివేల పుస్తకాలకు అట్ట షార్ట్!- రాజా కొక పెద్ద షాక్!

రాజా కోపంతో ఎగిరెగిరి పడినాడు. అట్లానే ఎగిరి విమానంలో పడినాడు. గంటల్లో రాజధాని నగరంలో పడినాడు. ఆ మీదట కార్లోపడి ఆ కార్లోనే పడుతూ లేస్తూ ప్రభుత్వ ముద్రణాలయానికి వెళ్ళినాడు. సరాసరి వెళ్ళి "అట్టల గుమాస్తా" ఎదుట ఏకేయాలన్నంత కోపంతో వెళ్ళి అతని ముందు నిలబడినాడు.

"అట్టల గుమాస్తా" అతి వినయంగా లేచి నిలబడినాడు. నమస్కరించినాడు కూడా!

"నీ అతి వినయాలు అక్కడికాపు. పదివేల అట్టలు తక్కువ పంపిన దానికి కారణం చెప్పు. నేననుకుంటే నీవేమైపోతావో ఆలోచించి బదులు చెప్పు!" అని అన్నాడు రాజా అట్టహాసంగా.

అట్టల గుమాస్తా బాగా ఆలోచించే బదులు చెప్పినాడు.

"అయ్యా! అయ్యా! తమరు పెద్దవాళ్ళు. పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం- తమవంటి వాళ్ళకు కూడని పని. యాభైవేలు అట్టలకు బదులు నలభైవేలు అట్టల్ని మాత్రం పంపినానా! అంటే మిగిలిన అట్టల్ని వండుక తింటాననో మీరనుకొంటే అది చాలా పొరబాటు. అందులో మీరు సాక్షాత్ మినిష్టర్ కేండిడేట్. మీవట్ల అజాగ్రత్తగా ప్రవర్తిస్తే కొంప లంటుకపోవూ! అందుకే కవండి మీకు సరఫరా చేయవలసిన అట్ట నమూనా చూపిస్తూ యాభైవేలు అట్టలు ముట్టినట్లు మీ వద్దగ రశీదు తీసుకొనింది. ఇందులో ఏదో చిన్న మెలిక పడింది. మీరు బాగా ఆలోచించాలి. టెక్స్టుబుక్స్ డిమాండ్ మీకు తెలియనిదా? మీ వర్కర్లు అమ్మేసి ఉండొచ్చు. లేదా లారీ వాళ్ళు మోసం చేసి ఉండవచ్చు. మీరు తెలివిగా లారీలు దించినప్పుడే జాగ్రత్తగా లెక్కపెట్టుకొని ఉంటే ఈ గొడవంతా ఉండేది కాదు. ఈ విషయంలో ఈ పరిస్థితుల్లో తమకు నేనేమి సహాయం లేకపోతున్నందుకు విచారిస్తున్నాను!" అని తన సుదీర్ఘోపన్యాసాన్ని ముగించి అట్టల గుమాస్తా అట్టహాసంగా కూర్చున్నాడు- మంత్రిగారి కేండిడేట్ అన్న భయం కూడ లేకుండా!

ఇంతకాలం ఎంతో అట్టహాసంగా బతికిన రాజా నీళ్ళు నములుతూ నిలబడిఉండే రాజాను చూస్తూ అష్టరాల్ "అట్ట"హాసం చేసింది!★ □

